4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
ఆదివారం 22 జూన్ 2025
www.ntnews.com

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

# ఇవీ నాటి కేసీఆర్ నిజ ప్రతిపాదనలు

**గోదావరి-బనకచర్ల లింకు ప్రాజెక్టుపై రాష్ట్రానికి చెందిన పార్లమెంట్ సభ్యులతో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమావేశంతో ఈ వివాదం మరో మలుపు తిరిగింది. 2016 సెప్టెంబర్ 21న జరిగిన మొదటి అపెక్స్ కౌన్సిల్ సమావేశంలోనే గోదావరి-బనకచర్లకు బీజం పడిందని అఖిలపక్ష ఎంపీల సమావేశంలో ముఖ్యమంత్రి చెప్పారు. అందుకు సాక్ష్యంగా మొదటి అపెక్స్ కౌన్సిల్ సమావేశపు మినిట్స్‌లో గోదావరి జలాల వినియోగంపై నమోదైన కేసీఆర్ అభిప్రాయాలను చదివి వినిపించారు. ఆ వాక్యాలను మరొక్కసారి పాఠకుల కోసం ఇక్కడ ఉటంకించదలచాను.**



శ్రీధర్‌రావు దేశ్‌పాండే

పేజీ 6లో ముఖ్యమంత్రి చదివిన వాక్యాలు ఇవి. "For the existing, ongoing and future projects in both the states in Krishna River, more than 1,000 TMC of water is required. On the other hand more than 3,000 TMC is going waste into sea every year in Godavari River. Hence, he emphasized that as water is available, it has to be decided how best it can be utilized properly. He stressed the need for developing understanding between two states by sitting together by amicably settling the issues.''

ఏటా మూడు వేల టీఎంసీలు నిరుపయోగంగా సముద్రంలోకి పోతున్నాయన్న విషయం బ్రహ్మ పదార్థం కాదు. కేసీఆర్ మెదడులో పుట్టిన ఆలోచన అసలే కాదు. కేంద్ర జల సంఘం వారు గత 50 ఏండ్లుగా నమోదు చేసిన గోదావరి ప్రవాహాలపై కేసీఆర్‌కు సంపూర్ణ అవగాహన ఉన్నది. ఆ నీటిని రెండు రాష్ట్రాలు తమ ప్రయోజనాల కోసం, కృష్ణా నదిలో ఎదురవుతున్న లోటును భర్తీ చేసుకోవడానికి వినియోగించుకోవచ్చన్న అవగాహన ఆయనకు ఉద్యమ కాలం నుంచే ఉన్నది. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు అమల్లోకి వస్తే ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచుకొని ఎక్కువ నీటిని నిల్వ చేసుకునే వెసులుబాటు కర్ణాటక రాష్ట్రానికి కలుగుతుంది. దాంతో తెలంగాణకు కృష్ణా జలాల రాక మరింత ఆలస్యమవుతుంది. లేదా ప్రవాహాలు తగ్గిపోతాయన్న అవగాహన కూడా కేసీఆర్‌కు ఉన్నది. పై వాక్యాల్లో గోదావరి జలాల వినియోగానికి సంబంధించి ఒక స్థూలమైన అభిప్రాయం వ్యక్తం అయ్యిందే తప్ప, బనకచర్ల ప్రస్తావనే లేదు. నిజానికి ఆనాటికి బనకచర్ల ఊసే లేదు.

తెలంగాణతో తొలినాళ్ల నుంచి ఘర్షణ వైఖరి అవలంబించిన చంద్రబాబుతో గోదావరి జలాల తరలింపుపై చర్చలకు సానుకూల వాతావరణం లేకుండా ఉండింది. 2019లో ఆంధ్రప్రదేశ్‌లో అధికార మార్పిడి జరిగి జగన్ మోహన్‌రెడ్డి పాలన మొదలైన తర్వాత తెలంగాణలో రెండవసారి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ఏపీకి స్నేహహస్తాన్ని చాచారు. ఈ క్రమంలోనే గోదావరి జలాల వినియోగంపై కూడా ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్చించుకున్నారు. వారితోపాటు ఇరు రాష్ట్రాల ఇంజినీర్లు కూడా పాల్గొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించడానికి గోదావరి నదీ మార్గాన్ని ఉపయోగించి సఫలం చేసినట్టుగానే కృష్ణాలో కూడా ఆ ప్రయోగం సఫలం చేయగలమన్న విశ్వాసం కేసీఆర్‌కు ఉన్నది. తన ఆలోచనలను తెలంగాణ విశ్రాంత ఇంజినీర్లతో పంచుకొని ఒక ప్రాథమిక నివేదికను తయారు చేయాలని కోరారు. వారు ఒక అద్భుతమైన ప్రాజెక్టుకు రూపకల్పన చేసి కేసీఆర్ ముందుంచారు. పోలవరం కుడి కాలువ ద్వారా ప్రకాశం బ్యారేజీకి, అక్కడి నుంచి ఎగువన వైకుంఠాపురం వద్ద ఒక కొత్త బ్యారేజీని నిర్మించి నీటిని ఎత్తిపోయడం, ఒక టన్నెల్ ద్వారా పులిచింతల జలాశయానికి నీటిని తరలించడం, అక్కడ నుంచి నాగార్జునసాగర్ టెయిల్ డ్యామ్‌లో నీటిని ఎత్తిపోయడం, అక్కడ ఇదివరకే ఏర్పాటైన రివర్సిబుల్ పంపింగ్ వ్యవస్థను ఉపయోగించుకొని శ్రీశైలం డ్యామ్‌కు నీటిని తరలించడం.. ఇదీ స్థూలంగా ఆనాడు గోదావరి జలాలను నదీ మార్గం ద్వారా కృష్ణా నదీ వ్యవస్థలోకి తరలించడానికి తెలంగాణ విశ్రాంత ఇంజినీర్లు రూపొందించిన ప్రతిపాదనలు.

> **ఈ ప్రతిపాదనలను జగన్ మోహన్‌రెడ్డికి కేసీఆర్ వివరించారు. దీనిపై అధ్యయనం చేసి మరొక సమావేశంలో తమ అభిప్రాయం చెప్తామని అన్నారు. కానీ, కొన్ని నెలల తర్వాత ఏపీ భూభాగంలో నుంచే గోదావరి జలాలను తరలించడానికి గోదావరి-పెన్నా లింకు ప్రాజెక్టును తమ ప్రభుత్వం చేపడుతున్నట్టు జగన్ అసెంబ్లీలో ఏకపక్షంగా ప్రకటించారు. దీనికి కేసీఆర్ ప్రతిపాదించిన నదీ మార్గం స్కీమ్‌కు ఏ పోలికా లేదు. జగన్ పాలనా కాలంలో ఈ స్కీమ్ ముందుకుసాగలేదు.**

అయితే, రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టు రెండు రాష్ట్రాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఒకరి ప్రాజెక్టులపై మరొకరు కేంద్రానికి ఫిర్యాదులు చేయడం, జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులు వేయడం దాకా సాగింది. ఈ ఘర్షణలో జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ రాయలసీమ లిఫ్ట్ పథకంపై, మన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై స్టే విధించింది. రెండు రాష్ట్రాలకు ప్రయోజనకారిగా ఉన్న గోదావరి వరద జలాల తరలింపు పథకం మూలనపడింది. ఇదీ దాని పూర్వరంగం.



ఇప్పుడు చంద్రబాబు తనకు అలవాటైన పద్ధతిలోనే విభజన చట్టాన్ని తుంగలో తొక్కి ఏకపక్షంగా పోలవరం-బనకచర్ల పథకాన్ని ప్రకటించడమే కాదు, దూకుడుగా ముందుకు సాగుతున్నారు. కేంద్రంలో తనకున్న పరపతిని వినియోగించి అనుమతులు, ఆర్థిక సహాయం పొందడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు ఏకాణా ప్రయోజనం లేకపోగా గోదావరి జలాల్లో మన వాటాను, హక్కులను కోల్పోయే ప్రమాదం ఉందని, ఈ ప్రాజెక్టును అడ్డుకోవాలని ప్రతిపక్షాలు, ఇంజినీరింగ్ మేధావులు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. ఈ ఒత్తిడికి ప్రభుత్వం పార్లమెంట్ సభ్యుల సమావేశాన్ని ఏర్పాటు చేసింది. కానీ, అది మరొక రాజకీయ రగడకు దారితీసింది. గోదావరి-బనకచర్ల పాపమంతా కేసీఆర్‌దేనని ముఖ్యమంత్రి నిరూపించే ప్రయత్నం చేసి విఫలమయ్యారు. నాడు జగన్ మోహన్‌రెడ్డి ముందుంచిన నదీ మార్గం ప్రతిపాదనకు, ఈ రోజు చంద్రబాబు చేపట్టదలచిన పోలవరం-బనకచర్ల లింకు పథకానికి ఏ పోలికా లేదు. ఈ సంగతి తెలియక ఈ పథకానికి కేసీఆర్ 2019లోనే ఆమోదం తెలిపారని ఆరోపించి తప్పులో కాలేశారు.

2025 జూన్ 19న తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్లు ఒక పత్రికా సమావేశం ఏర్పాటు చేసి ఈ నదీ మార్గం ప్రాజెక్టు వివరాలను మ్యాప్ సహా వివరించారు. పోలవరం-బనకచర్ల పథకానికి బదులుగా ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. ఇందులో ఖర్చు తక్కువ, భూసేకరణ తక్కువ, మూడు పెద్ద జలాశయాలు.. పులిచింతల (45 టీఎంసీలు), నాగార్జునసాగర్ (315 టీఎంసీలు), శ్రీశైలం (215 టీఎంసీలు) ఇదివరకే నిర్మాణమై అందుబాటులో ఉన్న కారణంగా బొల్లపల్లి (150 టీఎంసీలు) లాంటి పెద్ద జలాశయం నిర్మించే అవసరం రాదు. కాబట్టి, పునరావాసం అసలే లేదు. కృష్ణా నది సజీవమవుతుంది. భూగర్భజలాలు పెరుగుతాయి. దేశీయ నౌకయానం, పర్యాటక, మత్స్యరంగాలు అభివృద్ధి చెందుతాయి. రెండు రాష్ట్రాలు గోదావరి అదనపు జలాలను తమకు ఇష్టమైన రీతిలో వినియోగించుకునే అవకాశం ఉన్నది. ఇన్ని ప్రయోజనాలున్న ప్రాజెక్టును కేంద్రప్రభుత్వం, రెండు రాష్ట్ర ప్రభుత్వాలు విశ్రాంత ఇంజినీర్లు కోరారు. వారి ప్రతిపాదనలను పరిశీలించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

ఇక 2020 అక్టోబర్ 2న కేంద్ర జలశక్తి మంత్రికి కేసీఆర్ రాసిన లేఖలో గోదావరి జలాల వినియోగంపై తన స్పష్టమైన ఆలోచనలను తెలియజేశారు. కేసీఆర్ రాసిన లేఖలోని 13వ పేజీలోని 13వ పేరాను పాఠకుల కోసం యథాతథంగా ఉటంకిస్తున్నాను. "In this context, it is worth noting that as per 53 years of Central Water Commission (CWC) gauge records at the last gauging station on Godavari River (Annexure-8) at least 3,000 TMC of water flows into the Bay of Bengal after the utilisation of both the States of Telangana and Andhra Pradesh. The erstwhile State of Andhra Pradesh itself had allocated 65.13 % of the Godavari waters to Telangana region. The 3,000 TMC of water flowing into the sea annually can also be used on pro-rata basis. Based on the total water requirement for irrigation, industry and drinking water, Telangana will use 1,950 TMC water per year in comparison to present allocation of 967.15 TMC. This additional water will be required for meeting the water requirements of more than one crore population of Mega- Metro city of Hyderabad which also has 30 to 40 lakh migrant workers. The needs of Hyderabad city are growing due to the expansion of IT and Pharma industries and the growth of its urban agglomerations."

> **ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాజెక్టులకు కేటాయించిన 968 టీఎంసీలకు అదనంగా ఏటా సముద్రంలోకి పోయే 3 వేల టీఎంసీలలో 1950 టీఎంసీల నీటిని తెలంగాణ ఇప్పటి అవసరాలకు, భవిష్యత్తు అవసరాలకు వాడుకుంటుందని కేసీఆర్ స్పష్టం చేశారు.**

1950 టీఎంసీల వరద నీటిపై కూడా తెలంగాణకు హక్కు ఉన్నది. కాబట్టి, కేంద్ర ప్రభుత్వం తక్షణమే అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి రెండు రాష్ట్రాల ప్రయోజనాలకు ఉపయోగపడే, ఆర్థిక భారం పడని ప్రాజెక్టుపై కూలంకషంగా చర్చించాలి. దీనిపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాల మధ్య మధ్యవర్తిగా ఒక త్రైపాక్షిక ఒప్పందానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలి. తెలంగాణ ప్రభుత్వం కూడా రాజకీయాలకు తెరదించి అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరాలి. అంతకుముందు మరొక విస్తృత స్థాయి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి తెలంగాణ డిమాండ్లను చర్చించాలి. సమావేశపు తీర్మానాలను అపెక్స్ కౌన్సిల్ ఎజెండాలో చేర్చాలని కేంద్రాన్ని కోరాలి. లేని పక్షంలో రాష్ట్రంలో అవాంఛనీయమైన రాజకీయ రగడ కొనసాగుతూ ఉంటుంది. సందట్లో సడేమియాలాగా చంద్రబాబు కేంద్రం అండతో గోదావరి నీటిని తన్నుకుపోతారు. గోదావరి జలాలపై తెలంగాణ సమాజం ఏకతాటిపై నిలబడి హక్కులను సాధించుకోవలసిన సమయం ఇదే. ఆలస్యం అమృతం విషం అన్న సంగతి తెలిసిందే కదా!

(వ్యాసకర్త: విశ్రాంత సూపరింటెండింగ్ ఇంజినీర్)



# సాంకేతికతతో సమస్యలు తీరుతయా?



కె.వేణుగోపాల్
98665 14577

ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక సాంకేతిక బోధన సేవల కోసం రేవంత్ ప్రభుత్వం ఇటీవల ఆరు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నది. ఒక్కో సంస్థ ఒక్కో విధమైన సేవలు అందించనున్నది. ఇప్పటికే 540 పాఠశాలల్లో పనిచేస్తున్న ఓ సంస్థ 33 జిల్లాల్లో కృత్రిమమేధ ఆధారిత ప్లాట్‌ఫామ్‌తో 3 నుంచి 5 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషు, గణితంలో ప్రాథమిక అంశాలను బోధించనున్నది. మరో సంస్థ ఇంటర్ నీట్, జేఈఈ, క్యాట్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేస్తూ, పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షల దృక్కోణంలో శిక్షణ ఇవ్వనున్నది. ఇంకొక సంస్థ 6 నుంచి 12 తరగతుల విద్యార్థులకు బాల సురక్ష, రక్షణ కార్యక్రమాల సేవలను అందించనున్నది. ఇంకో సంస్థ 1 నుంచి 10 తరగతుల విద్యార్థులకు కోడింగ్, కంప్యూటేషనల్ థింకింగ్‌పై శిక్షణ ఇవ్వనుండగా, మరొకటి పాఠశాలలకు దూరంగా ఉన్న 16 వేల మంది విద్యార్థులను తిరిగి బడిలో చేర్పిస్తూ బాలికల అక్షరాస్యత, విద్యా అవకాశాలను పెంపొందించేందుకు కృషి చేయనున్నది. ఇక మరో సంస్థ 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు వీడియో ఆధారిత సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్ (స్టెమ్) శిక్షణను అందించనున్నది. అయితే, ఇప్పటికే 540 పాఠశాలల్లో పనిచేసిన సంస్థ ద్వారా విద్యార్థుల సామర్థ్యాలు, అభ్యసన ఏ మేరకు అభివృద్ధి చెందాయో విద్యాశాఖ సమీక్షించిందా? దాని ఫలితాలెలా ఉన్నాయి? అన్నవి ఇక్కడ ప్రశ్నలు.

> **ఒప్పందం చేసుకున్న సంస్థలన్నీ విద్యకు సంబంధించిన టెక్నాలజీ రూపొందించి, అందించే వ్యాపారంలో ఉన్నవే. ప్రస్తుత ఒప్పందం ప్రకారం అవి ఉచితంగా ప్రభుత్వ పాఠశాలల్లో సేవలు అందిస్తున్నప్పటికీ, ఈ సేవలను వినియోగదారులైన ప్రైవేటు విద్యాసంస్థలకు శాంపిల్‌గా చూపిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో వాటిని విజయవంతంగా వినియోగిస్తున్నామని ప్రచారం చేసుకుంటూ, తమ వ్యాపారాన్ని మరింతగా విస్తరించుకునే అవకాశం ఉంది.**

సాంకేతిక విప్లవం విద్యారంగంలోనూ అనేక మార్పులు తీసుకువచ్చింది. విద్యా వ్యవస్థలో డిజిటల్ లెర్నింగ్ ప్రాధాన్యం పెరిగింది. గతంలో సాంప్రదాయ విధానంలో ఉండే బ్లాక్ బోర్డు, చాక్ పీస్ లెర్నింగ్ స్థానంలో డిజిటల్ స్క్రీన్లు తరగతి గదుల్లో ప్రత్యక్షమయ్యాయి. అయితే పుస్తకాల స్థానంలో కంప్యూటర్లను తీసుకొచ్చి దాదాపు 15 ఏండ్లపాటు డిజిటల్ ఎడ్యుకేషన్‌ను ప్రోత్సహించి, అమలు చేసిన స్వీడన్ దేశం డిజిటల్ ఫస్ట్ విధానం వల్ల విద్యార్థుల్లో చదవడం, రాయడం వంటి ప్రాథమిక నైపుణ్యాలు క్షీణిస్తున్నాయనే విషయాన్ని గుర్తించింది. దీంతో తమ దేశంలో సాంప్రదాయ విద్యా విధానంలో పాఠాలు బోధించాలని పాఠ్యపుస్తకాలు, చేతిరాత కోసం పేపరుకు చోటు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నది. విద్యార్థుల స్క్రీన్ టైమ్ గురించి స్వీడన్ విద్యా శాఖ మంత్రి లోటా ఎడోమ్ గతేడాది ఆందోళన వ్యక్తం చేశారు.

మొదటి ఐదేండ్ల కాలంలో పిల్లలకు బొమ్మలతో బోధించి కథలు చెప్పే విధంగా ప్రాథమిక విద్య అభ్యసనా ప్రక్రియ ఉంటుంది. పిల్లలు ఆడుకోవడం, వస్తువుల అమరిక ద్వారా భాష, గణిత నైపుణ్యాలకు సంబంధించిన పూర్వజ్ఞానాన్ని ఆర్జిస్తారు. కాబట్టి, వీటికి సంబంధించిన కృత్యాలను జట్టుగా, వ్యక్తిగతంగా పిల్లలతో ఉపాధ్యాయులే భౌతికంగా చేయించడం ముఖ్యం. అప్పుడే వారిలో జ్ఞానేంద్రియాల సమన్వయం జరిగి అభ్యసనం ఆరంభమవుతుంది. పైగా వారిలో బెరుకు స్వభావం తొలగిపోయి, తార్కిక జ్ఞానం, సృజనాత్మకత పెరుగుతాయి. ఇదిలా ఉంటే భారతదేశంలో మాత్రం డిజిటల్ ఎడ్యుకేషన్ విధానం దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. డిజిటల్ ఎడ్యుకేషన్ కోసం కొత్త, కొత్త ఓటీటీ యాప్‌లు పుట్టుకొస్తున్నాయి. పలక, బలపం, పేపర్, పెన్ను స్థానంలో నర్సరీ నుంచే విద్యార్థుల చేతుల్లోకి డిజిటల్ గ్యాడ్జెట్లు వచ్చి చేరుతున్నాయి. ఈ నేపథ్యంలో డిజిటల్ ఎడ్యుకేషన్ విషయంలో స్వీడన్ ప్రభుత్వ అనుభవాల రీత్యా మన దేశంలోనూ డిజిటల్ విధానంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలనే డిమాండ్లు విద్యారంగ నిపుణుల నుంచి వినిపిస్తున్నాయి.

2008లో అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఉమ్మడి ఏపీలోని వెయ్యి పాఠశాలల్లో కంప్యూటర్ విద్యకు పునాది వేసింది. ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లతోపాటు, ఇన్‌స్ట్రక్టర్‌ను సమకూర్చింది. తీరా ఆ స్వచ్ఛంద సంస్థ కాలపరిమితి ముగిసిపోగానే, ఆయా పాఠశాలల్లో చెడిపోయిన కంప్యూటర్లను కనీసం మరమ్మతులు చేయించడం గాని, ఇన్‌స్ట్రక్టర్ల నియామకం గాని చేయకపోవడం వల్ల ఆ వ్యవస్థ మూలకు పడిపోయింది. స్వచ్ఛంద సంస్థలు తాము రూపొందించిన ప్రణాళిక ప్రకారం శిక్షణ ఇస్తాయే గానీ, తిరిగి ఆ ప్రణాళిక అమలు పరచాల్సింది విద్యాసంస్థలు, విద్యా శాఖనే. స్వచ్ఛంద సంస్థలు పనిచేసిన కాలంలోని మంచి పనులు, సాధించిన ఫలితాల గురించి విద్యాశాఖ వద్ద ఏమైనా సమాచారం ఉందా? జవాబుదారీతనం లేకుండా ఇటువంటి సంస్థలు పాఠశాలల్లో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యాశాఖ రూపొందించిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం జరిగే బోధనకు ఆటంకం కల్పిస్తున్నాయనే ఆరోపణలు క్షేత్రస్థాయిలో ఉన్నాయి.

> **మన రాష్ట్రంలో పాఠశాలలకు భౌతిక వసతులు, మౌలిక వసతుల కొరత, విద్యార్థులను ఆకర్షించే పాఠశాల పరిసరాలు లేకపోవడం, పర్యవేక్షణ లేకపోవడం, ఉపాధ్యాయులకు బోధనా కార్యక్రమాలు కాకుండా యాప్‌లతో ఆన్‌లైన్‌లో రిపోర్టులను సమర్పించడం, ముఖ గుర్తింపు హాజరు వంటి అనవసర కార్యక్రమాలతో కీలక బోధనా సమయం వృథా కావడం వంటి సమస్యలున్నాయి. వాటిని తీర్చడానికి శాశ్వత విధానాలను తక్షణమే అభివృద్ధి చేయాలి. ఈ వసతులు కల్పించడానికి బడ్జెట్‌లో విద్యారంగానికి ఇతోధికంగా నిధులను కేటాయించాలి.**

రాష్ట్రంలో పాఠశాల విద్య అభ్యసన, పర్యవేక్షణ, విద్యా సంక్షోభాలను ఎదుర్కొంటున్నది. ఈ సమస్యలపై విద్యావేత్తలతో, విద్యా కమిషన్ సభ్యులతో, విద్యాశాఖ అధికారులతో, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి నిర్ణయాలు తీసుకొని, వాటిని శాశ్వతంగా అమలు చేసే చర్యలు తీసుకోవాలి. పాఠశాల విద్యపై ముందుచూపుతో సమగ్ర, శాశ్వత నిర్ణయాలు తీసుకోవాల్సిన ప్రభుత్వం డిజిటల్ బోధన లాంటి చిట్కాలతో సమస్యను పరిష్కరించడానికి సిద్ధపడటం శోచనీయం. ప్రభుత్వ విద్య ఆదరణ కోల్పోవడానికి కారణాలను అన్వేషించి శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు వేసిన విద్యా కమిషన్ నివేదికపై చర్యలు తీసుకోవాలి. డిజిటల్ విద్యపై పాశ్చాత్య దేశాల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పాఠశాల విద్యలో సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవడం అత్యవసరం. అంతేగానీ పుండొకటైతే మందొకటి అన్న చందంగా పాపులిస్ట్ విధానాలతో సమస్యలకు సమూల పరిష్కారం లభించదు.

(వ్యాసకర్త: విద్యారంగ విశ్లేషకులు)

# ప్రజలపై ఇంతటి ప్రతీకారమా?

**తెలంగాణ ప్రభుత్వం అర్ధాంతరంగా ఫార్ములా-ఈ ఒప్పందాన్ని రద్దు చేయడం వల్ల రాష్ట్ర అభివృద్ధి కుంటుపడుతుందని భావించి 2025 జనవరి 28న ఈ ప్రాంత బిడ్డగా నార్సింగి పోలీస్ స్టేషన్‌లో నేను ఫిర్యాదు చేశారు. ఇప్పటివరకు పోలీస్ స్టేషన్ నుంచి కేసుకు సంబంధించి ఎలాంటి సమాచారం రాలేదు. నేనే స్వయంగా పోలీస్ స్టేషన్ అధికారికి ఫోన్ చేసి అడిగితే 'కేసు క్లోజ్ చేశామ'ని అన్నారు. నన్ను సంప్రదించకుండానే కేసు ఎట్లా క్లోజ్ చేస్తారని ప్రశ్నిస్తే 'సార్ మీకు తెలుసు కదా! మీరు ఏకంగా ముఖ్యమంత్రి మీదే కేసు పెట్టారు. మేమేం చేయాలి' అని చెప్పారు.**



డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



సుదీర్ఘ కాలం పోలీసు శాఖలో ఉన్నతాధికారిగా పనిచేసిన నాకే, హైదరాబాద్ నడిబొడ్డున ఇలాంటి పరిస్థితి ఎదురైందంటే, ఇక ఇతర మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ వ్యవస్థ పనితీరు ఎలా ఉంటుందో ఊహకు అందడం లేదు. భారత న్యాయ సురక్ష సంహితలోని సెక్షన్ 173 ప్రకారం.. ఫిర్యాదుదారుడికి కనీస సమాచారం ఇవ్వకుండా, కేసుకు సంబంధించిన ఆధారాల గురించి వాకబు చేయకుండా కేసు మూసివేయకూడదని పోలీసు అధికారులకు తెలియదా? తెలుసు, కానీ చట్ట ప్రకారం చేస్తే ఉద్యోగాలు ఎక్కడ ఊడతాయోనని భయం. ఈ భయానికి కారణం రేవంత్‌రెడ్డే.

నిత్యం లంకె బిందెల గురించి ఆలోచించే వ్యక్తి, అబద్ధాలు చెబితేనే ప్రజలు నమ్ముతరని బహిరంగంగా చెప్పిన వ్యక్తి, రూ.50 లక్షల బ్యాగుతో లంచం ఇస్తూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడి, దాదాపుగా 89 క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్న వ్యక్తి చేతిలో రాజ్యాంగబద్ధమైన సంస్థలు ఉంటే, అవి ఎలా పనిచేస్తాయో ఇక్కడ ప్రత్యేకంగా చర్చించుకోవలసిన అవసరం లేదు. కానీ, కనీసం రాజ్యాంగబద్ధమైన సంస్థల్లో పనిచేసే కఠోరమైన పరీక్షలు రాసి ఎంపికైన అధికారులైనా చట్టబద్ధంగా, రాజ్యాంగ విలువలను కాపాడేలా పనిచేయాలి కదా! కానీ, 'కొందరు అధికారులు' ముఖ్యమంత్రి ప్రతీకార వాంఛతో ఇస్తున్న అక్రమ ఆదేశాలకు ఎదురుచెప్పకుండానే అతి విధేయతతో వెంటనే లొంగిపోతున్నారు. ఈ ధోరణి వల్లే ఇబ్బడిముబ్బడిగా ప్రజలపై అక్రమ కేసులు నమోదవుతున్నాయి. అలాంటి ఓ కేసే ఫార్ములా-ఈ కేసు.

ఈ-కార్ రేస్ కేసులో అధికారులు చట్టం, రాజ్యాంగాన్ని పక్కనపెట్టి ముఖ్యమంత్రి-హోం మంత్రి ఆదేశాల మేరకే పనిచేసినట్టుగా కనిపిస్తున్నది. ఎవరిని హత్య చేయలేదు, ఎవరికి హాని తలపెట్టలేదు, ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించలేదు, తెలంగాణ పరువును ప్రపంచ దేశాల ముందు కించపరచలేదు, లంచం తీసుకోలేదు. అయినా కేటీఆర్‌పై కేసు పెట్టారు. ఆయన రోడ్డు మీద నడిస్తే కేసు, మాట్లాడితే కేసు, కాళేశ్వరం ప్రాజెక్టు చూడడానికి పోతే కేసు, లగచర్ల రైతులకు అండగా నిలబడితే కేసు, ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని నిలదీస్తే కేసు, జై తెలంగాణ అంటే కేసు, హైడ్రా పేరుతో పేదలను ఆగం చేయొద్దంటే కేసు, ఆఖరికి శ్వాస తీసుకుంటే కూడా కేసులు నమోదు చేసే పరిస్థితి నేటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్నది. 18 నెలల కాంగ్రెస్ పాలనలో కేటీఆర్ మీద 14 కేసులు నమోదయ్యాయి.

> **ఫార్ములా-ఈ రేస్ 2011లో పారిస్‌లో రూపొందింది. 2014లో బీజింగ్‌లో మొట్టమొదటి రేస్ జరిగింది. నేటికి కూడా పన్నెండవ సీజన్ ఇండోనేషియా రాజధాని జకార్తాలో జరుగుతున్నది. తొమ్మిదవ ఫార్ములా-ఈ రేస్ ఛాంపియన్‌షిప్ మన హైదరాబాద్ వేదికగా ఆనాటి తెలంగాణ ఐటీ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ హయాంలో 2023 ఫిబ్రవరి 11న జరిగింది. దేశంలో ఏ నగరానికి దక్కని అరుదైన గౌరవం ఆనాడు మన హైదరాబాద్‌కు దక్కింది.**

పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడం, సాంకేతిక పరిజ్ఞానం, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం, తద్వారా అంతర్జాతీయంగా వివిధ కంపెనీల నుంచి తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు రప్పించి వేలాది మంది తెలంగాణ బిడ్డలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ఈ రేస్‌ను నిర్వహించారు. దీనివల్ల దాదాపు రూ.700 కోట్ల ఆదాయం వచ్చిందని నెల్సన్ సంస్థ తెలిపింది. అంటే స్వల్ప పెట్టుబడితో రాష్ట్రానికి అమితమైన లాభాలు అన్నమాట! అందుకేనేమో థాయిలాండ్ ప్రభుత్వం గత వారం 1.2 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఫార్ములా-1 రేసులకు శ్రీకారం చుట్టింది.

ఫార్ములా-ఈ రేసు కోసం ఆనాటి తెలంగాణ ప్రభుత్వం తరపున హెచ్ఎండీఏ అధికారులు రూ.55 కోట్లు ఖర్చు చేశారు. ఈ సొమ్ము అధికారికంగా ప్రభుత్వం నుంచి నిర్వహణ బాధ్యతలు చేపట్టిన లండన్‌లోని ఫార్ములా-ఈ సంస్థ అకౌంట్‌కు చేరింది. వాళ్లు ఈ డబ్బులు తమ ఖాతాల్లోనే ఉన్నాయని, ఇంకా ఇవ్వాల్సిన 50 శాతం కూడా జమ చేస్తేనే 10వ సీజన్‌ను నిర్వహిస్తామని చెప్పారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు, అక్రమాలు జరగలేదు. ఎవరి వ్యక్తిగత అకౌంట్‌లో ప్రభుత్వ డబ్బు జమకాలేదు. సంవత్సరం పాటు పరిశోధించిన తర్వాత కూడా ప్రస్తుత ఫిర్యాదుదారులు, పురపాలక ప్రిన్సిపల్ సెక్రెటరీ ఇచ్చిన ఫిర్యాదులో కూడా డబ్బు తప్పుదోవ పట్టిందని ఎక్కడా పేర్కొనలేదు. మరి అలాంటప్పుడు అవినీతి నిరోధక చట్టం కింద ఇది నేరమెలా అవుతుంది?

విచిత్రమైన విషయం ఏంటంటే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పెట్టుబడులను ఆకర్షించడం కోసం లేదా ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ పేరు, గొప్పతనం తెలియపరచడం కోసం మిస్ వరల్డ్ పోటీలు, ఎయిర్ షో, ఏఐ సమ్మిట్, కైట్ ఫెస్టివల్ లాంటి కార్యక్రమాలు నిర్వహించింది. ఒక రాష్ట్రం లేదా ప్రాంతం ఉనికిని చాటడం కోసం, ప్రపంచ దేశాలకు మన సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేయడం కోసం, పర్యాటక ప్రాంతాలు, అందమైన కట్టడాల దిశగా విదేశీ పర్యాటకులను ఆకర్షించడం కోసం, పెట్టుబడులు సాధించడం కోసం ఆయా ప్రాంత పాలకులు ప్రయత్నిస్తుంటారు.

> **గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా నిర్మించాలనుకున్న ఎస్ఎల్‌బీసీ సొరంగం కోసం దాదాపుగా రూ.4,000 కోట్లు ఖర్చు పెట్టినా, 20 సంవత్సరాలైనా అది ఇంకా పూర్తి కాలేదు. ఇటీవల అందులో జరిగిన ఒక ప్రమాదంలో 8 మంది చనిపోయారు కూడా. దానికి నాటి కాంగ్రెసు ప్రభుత్వంపై కేసు పెట్టగలమా? ప్రజాస్వామిక ప్రభుత్వాల పాలనలో వ్యక్తిగత అవినీతి లేనప్పుడు, ప్రజాప్రయోజనాలే పరమావధిగా తీసుకున్న నిర్ణయాలు నేరాలెలా అవుతాయి?**

కానీ, ఇలాంటి నిర్ణయాలపై కూడా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా కేసులు నమోదు చేసి, ఈడీ, ఏసీబీ విచారణ జరిపిస్తున్నది. ఎలాగైనా ప్రజల గొంతుకైన కేటీఆర్‌ను జైలుకు పంపాలనే దుష్ట ఆలోచనతో ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేయని ప్రయత్నం లేదు. ఈ విషయంపై గోప్యంగా విచారణలు వద్దని, తెలంగాణ ప్రజానీకానికి తెలిసేలా అసెంబ్లీలో చర్చ పెడదామని, అవసరమైతే బహిరంగంగా చర్చిద్దామని, కుదిరితే లై డిటెక్టర్ పరీక్ష కూడా చేయించుకుందామని కేటీఆర్ సవాల్ విసిరారు. కానీ, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. పైగా నోటీసుల మీద నోటీసులు ఇచ్చి రికార్డులన్నీ ప్రభుత్వం వద్దే ఉన్నా 'మీ సెల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు సరెండర్ చేయండి' అని కక్షసాధింపులకు దిగుతున్నారు.

ఈ విధంగా కేటీఆర్ ఒక్కరి మీదే కాదు, మాజీ మంత్రి హరీశ్‌రావు మీద కూడా ఏడు కేసులు నమోదయ్యాయి. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మీద కూడా అక్రమ కేసు పెట్టి విచారణకు పిలిపించారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇంచార్జి కొణతం దిలీప్, మన్నె క్రిశాంక్ మీద కూడా అక్రమ కేసులు బనాయించారు. ముఖ్యమంత్రి కార్యాలయం అభయం ఇవ్వకపోతే ఏ అధికారి కూడా ఇలాంటి దుస్సాహసాలు చేయరన్నది సుస్పష్టం.

ఒక అవినీతి కేసులో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ నేరచరిత్ర ఉన్న వ్యక్తి సీఎంగా, హోం మంత్రిగా ఉంటే ఎలా ప్రవర్తిస్తారో తెలంగాణ ముఖ్యమంత్రిని చూస్తే అర్థమవుతుంది. ఎలాంటి పదవిలో లేని తన సోదరుడు తిరుపతి రెడ్డికి రెడ్‌కార్పెట్ స్వాగతం పలకడం, గన్‌మెన్లను ఇవ్వడం, సీఎం సోదరుల పేర్లు రాసి చనిపోయిన కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సాయిరెడ్డి కేసు దర్యాప్తు ఆగిపోవడం, మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళికి ఎస్కార్ట్‌తో భద్రత కల్పించడం, మరోవైపు వందల సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు పలు అంశాలకు సంబంధించి కేసులు పెట్టినా కనీసం ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం వంటి అతి వినయ ప్రదర్శనలు రేవంత్ ప్రతీకార పాలనలోనే సాధ్యం. ఎన్ని కేసులు పెట్టినా బీఆర్ఎస్ నాయకుల మనోధైర్యాన్ని గాయపరచలేవు. కానీ, పట్టపగలే రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసే కుట్రలో 'కొంతమంది అధికారులు' భాగస్వాములు కావడం, మరికొందరు ప్రేక్షకపాత్ర వహించడం చాలా ఆందోళన కలిగిస్తున్నది.

ఇద్దరు ఎమ్మెల్యేలను (కేటీఆర్, హరీశ్‌రావులను) బహిరంగంగా పెట్రోల్ పోసి చంపుతామని హెచ్చరించిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుపై సుమోటో కేసు నమోదు చేయకుండా కళ్లప్పగించి, అధికార పార్టీకి తొత్తులుగా మారిన ఇలాంటి 'కొందరు అధికారుల' వల్లే రాజ్యాంగ సంస్థలకు తీరని నష్టం జరుగుతున్నది. ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇప్పటికైనా ఈ ప్రమాదకరమైన పరిస్థితి మీద మేధోమథనం చేయాలి. 'మీ ప్రతీకార వాంఛకు మమ్మల్ని బలిచేయకండి' అని పాలకులకు ఖరాఖండిగా చెప్పాలి. ఈ వ్యాసం రాసే నాటికి ఉత్తర తెలంగాణలో మంత్రి కొండా సురేఖ భర్తకు అసాధారణ బందోబస్తు ఏర్పాటు చేసిన కింది స్థాయి పోలీస్ అధికారులకు ఓ పోలీస్ కమిషనర్ మెమోలు జారీచేసిన వార్త పత్రికల్లో ప్రచురితమైంది. ఆ వార్త చదువుతుంటే ఈ ప్రతీకార పాలన అంతమయ్యే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ఎక్కడో కొంత ఆశ చిగురించింది.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు)